క్లుప్తంగా

డీఈఎల్ఈడీ పరీక్షకు 27 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో సోమవారం నిర్వహించిన డీఈఎల్ఈడీ 4వ సెమిస్టర్ పరీక్షకు 27 మంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఎం. వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 28 మంది అభ్యర్థులకు గాను ఒకరు గైర్హాజరయ్యారని, ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు.

వికసిత్ భారత్ సాధనకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ చైతన్యకృష్ణ

దెందులూరు: వికసిత్ భారత్ సాధనకు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందజేయాలని బీజేపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ గుమ్మడి చైతన్య కృష్ణ అన్నారు. సోమవారం ఏలూరు రూరల్ మండలం ప్రత్తి కోళ్లలంక రామాలయం వద్ద ఏలూరు రూరల్ మండలం బీజేపీ అధ్యక్షుడు సుబ్రమణ్యం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుధాకర్ జిల్లా జనరల్ సెక్రెటరీ కే కృష్ణ, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి స్కేటింగ్‌లో పతకాలు



కోచ్ ఖాసిమ్‌తో పతకాలు సాధించిన చిన్నారులు

ఏలూరు రూరల్ : జోనల్ స్థాయి స్కేటింగ్ పోటీల్లో ఏలూరు బాలలు పతకాలు సాధించారని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కోచ్ ఎస్‌కే ఖాశిమ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13వ తేదీ నుంచి 15 వరకు కాకినాడలోని డాక్టర్ వైఎస్ఆర్ స్కేటింగ్ రింక్‌లో జోనల్ స్థాయి స్కేటింగ్ పోటీలు జరిగాయి. తూర్పు, పశ్చిమగోదావరి, గుంటూరు, ప్రకాశం జిల్లాల జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు ప్రాతినిధ్యం వహించిన శిఖా సహస్ర అండర్-12 విభాగంలో మూడు సిల్వర్ మెడల్స్, ఒక బ్రాంజ్ మెడల్ సాధించిందని పేర్కొన్నారు. ఇదే క్రమంలో అండర్-10 విభాగంలో శిఖా రమేష్‌బాబు బ్రాంజ్ మెడల్ చేజిక్కించుకున్నాడని తెలిపారు. విజేతలను జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి కేవీబీ రమేష్, డీఎస్‌డీఓ బి.శ్రీనివాసరావు, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి బి.వెంకట్రామయ్య అభినందించారని పేర్కొన్నారు.

సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం

- వైఫల్యాన్ని కప్పిపుచ్చుకొనేందుకు అక్రమ కేసులు
- ప్రజల కోసం వైఎస్సార్ సీపీ పోరాటం కొనసాగిస్తుంది
- పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఏలూరు ఇన్‌చార్జ్ జయప్రకాష్



జగన్ అంటే నమ్మకం, చంద్రబాబంటే మోసం పుస్తకాన్ని విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఏలూరు(ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో 2024-25 సంవత్సరం చీకటి అధ్యాయంగా మిగిలిపోతుందని, అన్యాయం, అక్రమం రాజ్యమేలుతున్నాయని వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ (జేపీ) అన్నారు. సోమవారం స్థానిక ఏలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జగన్ అంటే నమ్మకం- చంద్రబాబంటే మోసం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికల హామీల్లో సూపర్‌సిక్స్ అనే పథకాలతో పాటు మరెన్నో పథకాలను ప్రకటించిందని, అయితే అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఒక్క ఉచిత గ్యాస్ పథకాన్ని మాత్రమే అమలు చేయగా అది కూడా లబ్ధిదారులకు సక్రమంగా అందడం లేదన్నారు. అలాగే సూపర్‌సిక్స్‌లోని ఇతర పథకాలను సైతం అటకెక్కించారని చేయకచేయక తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తే దానిలో సుమారు 20 లక్షల మంది లబ్ధిదారులను తొలగించి ప్రజలను దారుణంగా మోసం చేశారన్నారు. ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పించుకోవడానికి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుందని ప్రతి ఒక్కరినీ అక్రమంగా అరెస్టు చేసి ఆటవికపాలనను కొనసాగిస్తున్నారని ధ్వజమెత్తారు. కనీసం తమ అభిప్రాయాన్ని చెప్పిన ప్రజలను, మేథావులను జైళ్లకు పంపి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తే ప్రజల నుంచి పూర్తి స్థాయి వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు మాట్లాడుతూ... జగన్ అనేక పథకాలకు దేశవ్యాప్తంగా ఒక రూపశిల్పిగా గుర్తింపు పొందగా చంద్రబాబు వాటిని కాపీ కొట్టి పేర్లు మార్చి వాటిని కూడా అమలు చేయలేక అబాసుపాలయ్యాడన్నారు. నగర అధ్యక్షుడు గుడిదేశీ శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి దాసరి రమేష్, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్‌గురునాథ్, జిల్లా కోశాధికారి సైదు ఏడుకొండలు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్ బాబు, సిటీ బీసీ సెల్ అధ్యక్షుడు కిలాడి దుర్గారావు, జిల్లా ఆర్‌టీఐ అధ్యక్షుడు స్టాలిన్ బాబు, దివ్యాంగుల విభాగ ప్రెసిడెంట్ ఎస్‌కే షమీం, ట్విన్ సెల్ ప్రెసిడెంట్ సముద్రాల చిన్ని, జిల్లా కార్యదర్శి జనార్ధన్, కంచుమర్తి తులసి, బత్తిన మస్తానరావు, రాష్ట్ర మైనారిటీ విభాగం కార్యదర్శి షేక్ గాజుల బాజీ,రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కిలారపు బుజ్జి, రాష్ట్ర మున్సిపల్ విభాగం కార్యదర్శి తంగెళ్ళ రాము, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి వీరవల్లి లక్ష్మి కుమార్, సిటీ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ జుజ్జువరపు విజయనిర్మల, ఎస్టీ సెల్ ప్రెసిడెంట్ దేవరకొండ నాగేశ్వరరావు, సిటీ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్, సిటీ గ్రీవెన్స్ సెల్ ప్రెసిడెంట్ మద్దాల పణి, ప్రెసిడెంట్ పిట్టా ధనుంజయ్, సిటీ సోషల్ మీడియా ప్రెసిడెంట్ సజన్, సిటీ డాక్టర్ సెల్ ప్రెసిడెంట్ కొవ్వాడ దుర్గారావు, సిటీ మేధావుల విభాగ ప్రెసిడెంట్ లెక్క బత్తుల ఏసుపాదం, సిటీ బూత్ వింగ్ ప్రెసిడెంట్ వెచ్చర్ల ఉమామహేశ్వరరావు, సిటీ పబ్లిసిటీ వింగ్ ప్రెసిడెంట్ కొల్లిపర భగవాన్, సిటీ వైఎస్సార్ టీ యూసి ప్రెసిడెంట్ గంటా రాజేశ్వరరావు, సిటీ వైస్ ప్రెసిడెంట్ రియాజ్ ఖాన్, సీటీ జనరల్ సెక్రెటరీ కుప్పల ఆంజనేయులు, తంగెళ్ళమూడి సురేష్ ఉన్నారు.

ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌పై ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ నుంచి ఉచితంగా 30 రోజుల పాటు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌పై శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చేశామని ఆ సంస్థ డైరెక్టర్ ఎం. ఫణికిషోర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ సమయంలో భోజనం, హాస్టల్ వసతి పూర్తిగా ఉచితమన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ఉచితంగా టూల్ కిట్టు ఇస్తామని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు బ్యాంకు నుంచి సర్టిఫికెట్, అర్హులైన అభ్యర్థులకు ముద్రలోనుకు సిఫారసు చేస్తామన్నారు. ఇతర వివరాలకు 9948565256, 9533079471 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

18న అల్లం గోపాలరావు సంతాప సభ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇటీవల మృతి చెందిన సినీ నటుడు, బుల్లితెర కళాకారుడు అల్లం గోపాలరావు మృతి ప్రజానాట్యమండలికి తీరని లోటని ఏపీ ప్రజానాట్య మండలి ఏలూరు కార్యదర్శి త మ్మా విశ్వేశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. 18న సాయంత్రం 5 గంటలకు సీపీఐ కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో జరుగుతుందన్నా రు. కళాకారులు గోపాలరావు సంతాప సభకు హాజరు కావాలన్నారు.

చట్టబద్ధత లక్ష్యంగా ప్రతి చెరువుకూ లైసెన్స్‌లు

త్వరితగతిన ఆక్వా సాగుకు లైసెన్సు ప్రక్రియ



లైసెన్స్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న మత్స్యశాఖ సిబ్బంది

దెందులూరు: ఏలూరు డివిజన్‌లో ఆక్వా సాగును చట్టబద్ధత చేసేందుకు (ఏపీ సదా) మత్స్య శాఖ చర్యలు తీసుకుంటుంది. రైతులను సాగు బాధ్యులు చేసే విధంగా లైసెన్స్ ప్రక్రియ దాదాపు పూర్తి చేశారు. మరింత పారదర్శకంగా ఆక్వా సాగు నిలిచేందుకు జవాబుదారీతనం కోసం ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటున్నారు. గ్రామస్థాయిలో మత్స్యశాఖ సహాయకులు ఈ ప్రక్రియను చేస్తున్నారు.

● లైసెన్సు ప్రక్రియ

ఏలూరు డివిజన్‌లో 13,861 ఎకరాలు ఆక్వా సాగు ఉంది. 5251 ఎకరాల్లో కేవలం పట్టా భూములకు మాత్రమే లైసెన్స్‌లు ఇవ్వడం జరిగింది.

● చెరువులకు యూనిక్ ప్రక్రియ విధానం

మత్స్యశాఖ ఇటీవల ఏలూరు డివిజన్ వ్యాప్తంగా అన్ని మండలాల్లో, గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. రైతులకు అవగాహన సభలు సమావేశాలు ర్యాలీల ద్వారా ఆక్వా డొనేషన్ వేగవంతంగా జరగటానికి కృషి చేస్తున్నారు. యూనిక్ నెంబర్ కేటాయింపు, గూగుల్ మ్యాప్ ప్రక్రియను లక్ష్యాలను ఆక్వా సాగు రైతులకు జరిగే మేలును గుర్తింపు చట్టబద్ధతను సుదీర్ఘంగా వివరించారు. క్షేత్ర స్థాయిలో రెవెన్యూ రికార్డుల మ్యూటేషన్... ఇటీవల చేపట్టిన భూ రీ- సర్వేలతో ఆన్లైన్‌లో వివరాలు కొన్ని తప్పులు దొర్లాయి. రికార్డులు కొంతమేర మార్పు చెందడంతో ఈ ప్రక్రియకు కొంతమేర ఆలస్యం జరుగుతుంది. ఒకటికి రెండుసార్లు మత్స్యశాఖ అధికారులు ఆన్‌లైన్‌లో రికార్డుల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలన తనిఖీ నిర్ధారణతో చెరువులకు యూనిక్ నెంబర్ మంజూరు కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. చేపలు, రొయ్యలు చెరువుల నుంచి ఉత్పత్తులు ఇతర రాష్ట్రాలు ఇతర దేశాలకు ఎగుమతి అయితే ఏదైనా పరిస్థితుల్లో నాణ్యత ప్రమాణాలు లోపించిన తప్పు జరిగిన యూనిక్ నెంబర్ ద్వారా గూగుల్ మ్యాప్ సహాయంతో ఏ చెరువు నుంచి ఉత్పత్తి అయింది ఆ చెరువు విస్తీర్ణం రైతు పేరు గ్రామం పేరు మండలం జిల్లా సాగు వివరాలు క్షణాల్లో తెలుసుకోవడం ఈ యూనిక్ ప్రక్రియ లక్ష్యం. యూనిక్ ప్రక్రియ గూగుల్ మ్యాప్ విధానంతో ఆక్వా సాగు చేసే రైతులకు పూర్తిస్థాయి బాధ్యత నాణ్యత ప్రమాణాలతో చేపలు, రొయ్యలు పెంపకం ఎగుమతులు దిగుమతులు చేసేలా ఈ కార్యక్రమం నిర్దేశిస్తుంది.

ఆక్వాలో సాగు సమాచారం కోసం



ఆక్వా సాగు చేసే చెరువులకు లైసెన్స్ ఇవ్వటం వల్ల సాగు చట్టబద్ధత అవుతుంది. ప్రతి చెరువుకు యూనిక్ నెంబర్ కేటాయింపు ప్రక్రియ రైతులకు ఎంతో మేలు చేస్తోంది. ఏ ప్రాంతంలో ఎంత ఆక్వా సాగు జరుగుతుంది, అభివృద్ధికి ఏం చర్యలు తీసుకోవాలో ప్రభుత్వానికి పూర్తి స్థాయి నివేదిక ఆన్‌లైన్‌లో పొందుపరచటం జరుగుతుంది. ఆక్వా సాగు చేసే రైతులకు ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి మౌలిక వసతులు కల్పన జరుగుతుంది.

రాజ్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్,
మత్స్యశాఖ, ఏలూరు జిల్లా

18న విజయవాడలో రైతుకూలీ సంఘ రాష్ట్ర సదస్సు

ఏలూరు(ఆర్ఆర్‌పేట): కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన ఎన్‌డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతాంగ సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాయని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి షేక్ బాషా అన్నారు. సోమవారం ఏలూరులో సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ ఈ నెల 18న విజయవాడలో ఉదయం 10 గంటలకు ఎంబీ భవన్‌లో నిర్వహించే రైతు కూలీ సంఘం రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలన్నారు. ఢిల్లీలో రైతాంగం పెద్ద ఎత్తున పోరాటం చేసినప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన హామీలలో ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. కనీస మద్దతు ధరల చట్టాన్ని తీసుకురాలేదని, రాష్ట్ర ప్రభుత్వం రకరకాల పేర్లతో ప్రజల నుంచి లక్షలాది ఎకరాల భూములు గుంజుకోవడం కోసం చర్యలు చేపడుతుందన్నారు. ఈ సదస్సుకు రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ ఝాన్సీ అధ్యక్షత వహిస్తారు. ఈ సదస్సులో వడ్డే శోభనాదేశ్వర రావు, భారత వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ మరల సోమసుందర్, రిటైర్డ్ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ ఎన్.వేణుగోపాలరావు, రాయలసీమ సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథ రామిరెడ్డి, రిటైర్డ్ ఇంజనీర్ పాపారావు, సిద్ధార్థ కళాశాల పీడీ ప్రిన్సిపల్ సీహెచ్ దివాకర్‌బాబు, రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి డీ.వర్మ, రైతులు పాల్గొంటారన్నారు.

బాల బాలికలు గుర్తింపు కార్డు కలిగి ఉండాలి



వసతి గృహంలో వండిన ఆహారాన్ని పరిశీలిస్తున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు(ఆర్ఆర్‌పేట): జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల ప్రకారం ప్రతి బాల బాలికలు గుర్తింపు కార్డు కలిగి ఉండాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్న ప్రసాద్ అన్నారు. సోమవారం శనివారపుపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు గుర్తింపు కార్డు లేని బాల బాలికలను గుర్తించే పనిలో ప్రభుత్వ వసతి గృహాన్ని సందర్శించడం జరిగిందన్నారు. ఈ వసతి గృహంలో గుర్తింపు కార్డు లేని బాలలను గుర్తించి, వారి వివరాలను సేకరించి సంబంధిత అధికారుల ద్వారా గుర్తింపు కార్డు జారీ చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఈ వసతి గృహంలో 9 మంది బాలలకు గుర్తింపు కార్డులు లేవని, కార్డుల జారీకి తగిన చర్యలను త్వరలోనే తీసుకుంటామని తెలిపారు. సిబ్బందితో మాట్లాడుతూ బాలలకు అందజేసే ఆహారంలో రాజీ పడవద్దని పరిశుభ్రమైన నాణ్యమైన ఆహారాన్ని అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలుర వసతి గృహ సూపరింటెండెంట్ శ్రీవల్లి పాల్గొన్నారు.

రేపే క్యాంపస్ డ్రైవ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రభుత్వ డీఎల్‌టీసీ/ఐటీఐ కళాశాలలో ఈనెల 18న బుధవారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు స్థానిక డీఎల్‌టీసీ సహాయ సంచాలకులు కే. రామచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ ఫెయిర్‌లో 15 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, ఈ క్యాంపస్ డ్రైవ్‌కు ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు, ఐటీఐ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ఈ క్యాంపస్ డ్రైవ్‌కు హాజరు అయ్యే అభ్యర్థులు తమ బయడేటా, సర్టిఫికెట్స్ నకళ్లతో హాజరు కావాలని తెలిపారు.

పెయింటింగ్ కార్మికులు, ఆర్టిస్టులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసడాంగే

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పెయింటింగ్ కార్మికులు, ఆర్టిస్టులను ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆర్ఆర్ పేట స్ఫూర్తి భవనంలో పెయింటింగ్ కార్మికుల సర్వసభ్య సమావేశం కేదారి వంశీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే మాట్లాడుతూ రాష్ట్రంలో వేలాది మంది పెయింటర్స్, ఆర్టిస్టులు పనిచేస్తున్నారన్నారు. భవన నిర్మాణ రంగంలో భాగంగా వృత్తి నిర్వహిస్తున్న ఈ కార్మికులు, మారిన పరిస్థితులలో పని దినాలు తగ్గ ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశాలలో ప్రమాదాలు జరిగినప్పుడు ఎటువంటి సహాయం వీరికి అందటం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును వెంటనే పునరుద్ధరించి, ఆ బోర్డు సంక్షేమ నిధి నుంచి పెయింటర్స్, ఆర్టిస్టులకు ఆర్థిక సహకారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, జిల్లా నాయకులు పీ. కిషోర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస్, ఏఐటీయూసీ ఏలూరు ఏరియా కార్యదర్శి ఏ అప్పలరాజు పాల్గొన్నారు. అనంతరం పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. గౌరవాధ్యక్షుడిగా రెడ్డి శ్రీనివాస్ డాంగే, అధ్యక్షుడిగా పీ.అజిత్ కుమార్, కార్యదర్శిగా వీ. శ్రీనివాస్, కోశాధికారిగా మహమ్మద్ జానీ, కమిటీ సభ్యులుగా వెంపటాపు రామకృష్ణ, పిల్లి రమేష్, బి. కోట సత్యనారాయణ, అప్పారావులు ఎన్నికయ్యారన్నారు.

రజక చెరువుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి జిల్లాలో రజకుల వృత్తి చెరువులు ఆక్రమణలకు గురై రజకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, జిల్లా సర్వేయర్‌తో సమగ్ర సర్వేచేయించి సరిహద్దులు నిర్ణయించాలని జిల్లా రజక జన సంఘ జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. సోమవారం ఏలూరులోని జిల్లా రజక సంఘ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ మేరకు జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లి తదితర గ్రామాల నుంచి విచ్చేసిన రజకులు పలు సమస్యలను తెలిపారు. ఈ సందర్భంగా కట్లయ్య మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అనేక మండలాల్లో రజక వృత్తి చెరువులు ఆక్రమణ గురయ్యాయని వాపోయారు. సమస్యలను అధికారులకు విన్నవించినా కనీసం పట్టించుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. సుమారు 46 క్రితం దేవులపల్లి గ్రామంలో బుచ్చమ్మ చెరువును రజకుల కేటాయించారని చెప్పారు. చెరువులో బ్రాందీ సీసాలు ఇతరత్రా వ్యర్థ పదార్థాల వేసినందువల్ల వృత్తి సమయంలో రజకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దేవులపల్లి రజక సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షుడిగా లింగాల గంగరాజు, ఉపాధ్యక్షుడిగా తాళ్లూరు నాగ వెంకట్రావు, కార్యదర్శిగా లింగాల నాగు, సహాయ కార్యదర్శిగా పాలూరు నాగు, కోశాధికారిగా గొర్రిపాటి రాంబాబులను ఎన్నుకున్నారన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	26	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	70
వంకాయలు (కాంతులు)	30	బిళ్లదిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	26	చామదుంపలు	48
బెండకాయలు	24	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	30	కంద	--
కాకర కాయలు	46	బీట్‌రూట్	36
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	90
క్యాబేజీ	22	అల్లం	64
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	20	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	33
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	37
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	24
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	19
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	30
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	21
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	36
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

హేలాపురి లయన్స్ సేవలు అభినందనీయం



లయన్స్ బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న లయన్స్ జిల్లా నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ 2025-26 సంవత్సరానికి నూతన కమిటీ ప్రమాణ స్వీకారం సోమవారం స్థానిక హేలాపురి లయన్స్ కల్యాణ మండపంలో అత్యంత వైభవంగా జరిగింది. క్లబ్ అధ్యక్షుడు పీవీ రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా లయన్స్ జిల్లా 316బీ పూర్వపు గవర్నర్, అంతర్జాతీయ గుడ్ విల్ ఆఫ్ అంబాసిడర్ అవార్డు గ్రహీత కాకినాడకు చెందిన బాదం బాలకృష్ణ పాల్గొని నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హేలాపురి లయన్స్ క్లబ్ గత 48 సంవత్సరాలుగా వివిధ రంగాలలో, పేదవారికి అవసరమైన అనేక రూపాలలో సేవలు అందజేయడం అభినందనీయమన్నారు. నూతన బృందానికి అభినందనలు తెలియజేస్తూ రాబోయే సంవత్సర కాలంలో సేవలు భిన్నమైన రూపంలో అందిస్తూ లయన్స్ క్లబ్ గుర్తింపులు, అభినందనలు పొందే విధంగా ప్రయత్నించాలన్నారు. క్లబ్ నూతన కమిటీ అధ్యక్షుడిగా బొల్లా వీర వెంకట సత్యనారాయణ, సెక్రటరీగా దుష్యంత్ చౌదరి, కోశాధికారిగా కూరపాటి సత్యనారాయణతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ లయనిజం సూత్రాలను అనుసరించి, క్లబ్ పూర్వపు చరిత్రకు తగినట్టుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా నాయకులు డీ. సుబ్బారావు, లేళ్ల వెంకటేశ్వర రావు, పుట్టా విజయశ్రీ, వీ. సత్యస్వరూప్, కుర్మా శ్రీనివాస్, దువ్వి హేమసుందర్, ఎం. కృష్ణమోహన్, డీ. సరస్వతి, కేబీ రావు, డీ. రమాదేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం 2024-25 సంవత్సరానికి సంబంధించిన వివిధ సేవా కార్యక్రమాల నివేదికను సమర్పించారు. అలాగే లయన్స్ బుక్‌లెట్‌ను విడుదల చేశారు.


ఏలూరులో బుద్ధ పార్కు వద్ద అగ్ని ప్రమాదం



వన్‌టౌన్ బుద్ధపార్క్ వద్ద ఇంట్లో అగ్ని ప్రమాదం దృశ్యం

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ బుద్ధపార్క్ సమీపంలోని ఒక ఇంట్లో సోమవారం రాత్రి ఆకస్మికంగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఇంట్లోని ఫ్రిడ్జి కంప్రెషర్‌లో షార్క్ సర్క్యూట్‌తో మంటలు చెలగాయి. ఈ మంటలు ఇంట్లో వ్యాపించటంతో సామగ్రి మంటల్లో కాలిపోయాయి. ఏలూరు వన్‌టౌన్ బెనర్జీపేట బుద్ధపార్క్ గేటు ఎదురుగా వీధిలో ఆళ్ళగడప వెంకటేశ్వరరావు ఇంట్లో ఇద్దరు తల్లికూతుళ్లతో నివాసం ఉంటున్నారు. వీరిద్దరూ స్థానికంగా హోటల్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి ఫ్రిడ్జి కంప్రెషర్‌లో మంటలు చెలరేగి ఇల్లంతా వ్యాపించాయి. సామగ్రితో పాటు ఏసీ ఇన్నర్ కూడా మంటల్లో కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అర్పివేశారు. సుమారు రూ.1లక్ష వర కూ ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

పిల్లల సేవకు ఏలూరులో 'గమయ'



ప్రారంభిస్తున్న అతిథులు (ఫైల్)

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విజయవాడకు చెందిన గమయ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను పిల్లలకు సేవలు అందజేసేందుకు ఏలూరులో అందుబాటులోకి తెచ్చినట్టు వ్యవస్థాపకుడు, సీనియర్ పీడియాట్రీషియన్ నోరి సూర్యనారాయణ, సెంటర్ డైరెక్టర్, సీనియర్ గైనకాలజిస్ట్ నోరి అనురాధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్ఆర్ పేట, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం వీధిలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో పలు విభాగాలను ఆశ్రం మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్ ఎం.మహేష్ కుమార్, గైనకాలజిస్ట్ ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ కె.వందన, శ్రీ కృష్ణ మదర్-చైల్డ్ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ జి.రవీంద్రనాథ్ ప్రారంభించారని వెల్లడించారు. ఆదివారం ప్రారంభించిన తమ సెంటర్‌లో అత్యాధునిక సేవలను అందజేస్తున్నామని, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల తల్లిదండ్రులు తమ పిల్లలకు వినియోగించుకోవాలని కోరారు.

ఏలూరు టౌన్ హాల్‌పై పోలీసుల దాడి



టౌన్ హాల్‌లో పోలీసుల దాడులు చేస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్: ఏలూరు టౌన్‌హాల్‌పై సోమవారం రాత్రి పోలీసులు ఆకస్మికంగా దాడులు చేపట్టారు. ఏలూరు టౌన్ హాల్‌లోని గదులు, అన్ని చోట్ల ముమ్మరంగా సోదాలు చేశారు. ఏలూరు నగరంలోని నలుగురు సీఐలు, ఎస్ఐలు, ఏకంగా 20మంది పోలీస్ సిబ్బందితో మెరుపుదాడి చేశారు. కానీ టౌన్ హాల్లో ఒక్క పేకాట బోర్డు కానీ, నగదు, కాయిన్స్ కానీ పోలీసుల తనిఖీల్లో దొరకకపోవటం గమనార్హం. గతంలో టౌన్ హాల్‌లో పేకాట నిర్వహించకుండా పోలీస్ అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టారు. ఇటీవల టౌన్ హాల్‌లో ఏలాంటి కార్యక్రమాలు జరగటంలేదని భావిస్తోన్న తరుణంలో ఆకస్మికంగా పోలీసులు దాడి చేయడం, ఏమీ లభించకపోవటంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఎవరైనా ముందస్తుగా టౌన్‌హాల్ నిర్వాహకులపై సమాచారం అందించారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.